సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 19 । నవంబర్ । 2023



జెడ్పీ బడ్జెట్ 1,363.16 కోట్లు

ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ 2024–25కు రూ.1,363.16 కోట్ల అంచనా ఆదాయ బడ్జెట్‌ను ఆమోదించారు. IIలో



15 నుంచి ఆడుదాం ఆంధ్ర

ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్ డిసెంబర్ 15 నుంచి జనవరి 26వ తేదీ వరకు జరగనుందని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. IIలో

'పట్టా'లు తప్పి పిచ్చి రాతలు

- క్రమబద్ధీకరణ పట్టాలపై ఈనాడు వక్రభాష్యాలు
- 'భూ దందా'అంటూ భయాందోళన సృష్టించే యత్నం

IIలో

న్యూస్‌రీల్

పారదర్శకంగా టీ-20 టికెట్ల విక్రయం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి

విశాఖ స్పోర్ట్స్: భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య ఈ నెల 23న జరిగే టీ–20 మ్యాచ్ టికెట్లను పారదర్శకంగా విక్రయించినట్లు ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు గానూ ఈ నెల 15, 16 తేదీల్లో ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయించినట్లు చెప్పారు. ఈ నెల 17, 18 తేదీల్లో పీఎంపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ క్రికెట్ స్టేడియం బీ గ్రౌండ్, వన్‌టౌన్‌లోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం, గాజువాకలోని రాజీవ్ గాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని కౌంటర్లలో కనీస ధర రూ.600 నుంచి గరిష్ట ధర రూ.6000లో పాటు రూ.1500, రూ.2000, రూ.3000, రూ.3500 టికెట్లను ఆఫ్‌లైన్‌లో విక్రయించినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న వారు.. స్టేడియంలో ప్రవేశానికి గానూ ఫిజికల్ టికెట్లుగా మార్చుకునేందుకు ఈ కౌంటర్లలో 22వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. మ్యాచ్ జరిగే రోజు కూడా స్టేడియంలో టికెట్లను మార్చుకోవచ్చని వెల్లడించారు.

నేటి నుంచి టీటీడీ క్యాలెండర్ల విక్రయాలు



ఎంవీపీకాలనీ : తిరుమల తిరుపతి దేవస్థానం క్యాలెండర్లు, డైరీల విక్రయాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటంతో కూడిన పెద్ద క్యాలెండర్ రూ.20, చిన్న క్యాలెండర్ రూ.15, 12 షీట్స్ క్యాలెండర్ రూ.130లకు విక్రయిస్తున్నట్లు టీటీడీ మేనేజర్ హైమావతి తెలిపారు. శ్రీవారి చిత్రపటంతో కూడిన డీలక్స్ డైరీ రూ.150, తెలుగు పంచాంగం రూ.30, టేబుల్ టాప్ క్యాలెండర్ రూ.75 విక్రయించడం జరుగుతుందన్నారు. దీంతో పాటు ఈ ఏడాది శ్రీవారి సేవలో వినియోగించిన పుష్పాలతో తయారు చేసిన స్పెషల్ క్యాలెండర్ అందుబాటులో ఉందన్నారు. దీన్ని రూ.600లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో విక్రయాలు జరుగుతాయన్నారు.

20న కుల గణనపై ప్రాంతీయ సదస్సు

మహారాణిపేట: వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో ఈ నెల 20న కుల గణనపై ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన స్టేక్ హోల్డర్లతో ఈ సమావేశం జరగనుంది. కులాల వారీగా జనాభా, వారి సామాజిక, విద్య, ఆర్థిక పురోభివృద్ధి తెలుసుకోవడానికి, సముచిత విధాన నిర్ణయాలు చేపట్టడానికి ఈ నెల 27న రాష్ట్ర వ్యాప్తంగా సర్వే నిర్వహిస్తున్నారు. సచివాలయ స్థాయిలో మొబైల్ యాప్ ద్వారా ఈ సర్వే చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తెలుసుకోవడానికి జిల్లా, ప్రాంతీయ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా ఈ నెల 20న విశాఖలో ఉత్తరాంధ్ర స్థాయి ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నారు.

ఆస్పత్రులకు మరో అవకాశం

మహారాణిపేట: విశాఖ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నడుపుతున్న ఆస్పత్రులు, క్లినిక్స్, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలు, ఫెర్టిలిటి కేంద్రాలు ఈనెల 30వ తేదీలోగా తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. లేకుంటే క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంటు యాక్ట్–2002 ప్రకారం చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.





మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

సాధికార పథం

తూర్పు నియోజకవర్గంలో శనివారం వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార **బస్సుయాత్ర** జైత్రయాత్రలా కొనసాగిసింది. యాత్రకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. **నాలుగున్నరేళ్లుగా** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి **చేసిన మేలును** వివరిస్తూ ముందుకు సాగిన మంత్రులు, ప్రజా ప్రతినిధుల వెంట ప్రజలు వైఎస్సార్ సీపీ జెండాలు పట్టుకుని అనుసరించారు. మేలు చేసిన ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ.. జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. పలు చోట్ల వైఎస్సార్ సీపీ రథానికి హారతులిచ్చి స్వాగతం పలికారు. జనం చూపిన అభిమానంతో తూర్పుతీరం మురిసిపోయింది.

- విశాఖ తూర్పులో సామాజిక సాధికార బస్సు యాత్రకు బ్రహ్మరథం
- భారీ ర్యాలీగా తరలివచ్చిన ప్రజలు
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన ప్రాంగణం



బహిరంగ సభకు హాజరైన ప్రజలు, పార్టీ శ్రేణులు, నాయకులు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో శనివారం వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రకు విశేష స్పందన లభించింది. యాత్రలో పాల్గొన్న మంత్రులు, ప్రజాప్రతినిధులకు ప్రజలు నీరాజనం పలికారు. నియోజకవర్గం పరిధి ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ వద్ద ప్రారంభమైన యాత్ర.. పులి వేషాలు, డప్పు వాయిద్యాల, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పెదగదిలిలో బీఆర్‌టీఎస్ మీదుగా జాతీయ రహదారికి చేరుకుంది. అప్పటికే అక్కడకు కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలపై వందల సంఖ్యలో చేరుకున్న పార్టీ శ్రేణులు బస్సును అనుసరించారు. వెంకోజీపాలెం, ఇసుకతోట మీదుగా ఎంవీపీకాలనీలోని సభా ప్రాంగణానికి యాత్ర చేరుకుంది. దారి పొడవునా వైఎస్సార్ సీపీ జెండాలతో ప్రజలు యాత్రలో భాగస్వాములయ్యారు. దీంతో నియోజకవర్గంలో పండగ వాతావరణం నెలకొంది.

యాత్ర సాగిందిలా..

- మధ్యాహ్నం 12.15 గంటలకు వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ, తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తదితరులు ఆరిలోవ చేరుకున్నారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద జీవీఎంసీ కల్యాణ మండపంలో జరిగిన విలేకరుల సమావేశంలో యాత్ర ఉద్దేశాన్ని నాయకులు వివరించారు.
- మధ్యాహ్నం 2.35 గంటకు ఆఖరి బస్టాప్ వద్ద మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వారంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- మధ్యాహ్నం 2.45 గంటలకు పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు. అక్కడ ప్రారంభమైన యాత్ర దుర్గాబజార్, టి.ఐ.సి పాయింట్, బాలాజీ నగర్, తోటగరువు వరకు సాగింది.
- 3.10 గంటలకు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్దకు చేరుకున్నారు. అక్కడ రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు, డీఈవో ఎల్.చంద్రకళతో కలసి వై.వి సుబ్బారెడ్డి పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులు పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి.. విద్యా విధానం, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేయడంతో.. వారిని అభినందించారు.
- అక్కడ నుంచి మధ్యాహ్నం 3.25 గంటలకు పెదగదలి కూడలిలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.
- అక్కడ నుంచి 3.35 గంటలకు బయలుదేరారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో హనుమంతవాక వద్దకు చేరుకుని.. అక్కడి నుంచి వెంకోజీపాలెం, ఇసుకతోట కూడలి మీదుగా ఎంవీపీ డబుల్ రోడ్డులోని ఎ.ఎస్ రాజా కళాశాల మైదానానికి సాయంత్రం 4.20 గంటలకు యాత్ర చేరుకుంది. తర్వాత బహిరంగ సభ ప్రారంభమైంది.

బస్సు యాత్రలో విశాఖ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు మొల్లి అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, **వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్,** నియోజకవర్గ పరిశీలకులు రొంగలి జగన్నాథం, ఐహెచ్ ఫరూఖీ, పలు కార్పొరేషన్ల చైర్మన్లు పేర్ల విజయ్‌చందర్, పిల్లా సుజాత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ, నాయకుడు రవిరెడ్డి, జోనల్ విభాగం ఇన్‌చార్జిలు పీలా వెంకటలక్ష్మి, మారుతీ ప్రసాద్, కార్పొరేటర్లు కంపా హనోక్, బర్కత్ అలీ, అక్కరమాని రోహిణి, స్వాతి దాస్, కెల్ల సునీత, అప్పారి శ్రీవిద్య, మొల్లి లక్ష్మి, గుడ్ల సత్యారెడ్డి, పల్లా అప్పలకొండ అప్పారావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కృపాజ్యోతి, డైరెక్టర్లు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే అనిల్



తోటగరువు ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు, వై.వి.సుబ్బారెడ్డి

సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యం



సామాజిక న్యాయం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని సామాజిక వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. మేయర్, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ పదవులను బీసీ మహిళలకు కేటాయించి..బీసీలకు అగ్రస్థానం కల్పించారు. చంద్రబాబు పాలనలో బీసీ వర్గాలకు ఎలాంటి న్యాయం జరగలేదు. ఆయన పాలనలో చేసిన మేలంటూ చెప్పుకోవడానికి ఏమీ లేదు.

– ఎంవీవీ సత్యనారాయణ, ఎంపీ

అభివృద్ధి చేశాం.. సంక్షేమం అందించాం..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

అందుకే ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్తున్నాం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ఆరిలోవ: 'రాష్ట్రంలో అధికారం చేపట్టి.. ఈ నాలుగున్నరేళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేశాం. అందుకే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి.. చేసిన అభివృద్ధిని వివరిస్తున్నాం.'అని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. తూర్పు నియోజకవర్గంలో శనివారం సామాజిక సాధికార బస్సు యాత్ర జరిగింది. ఇందులో భాగంగా 13వ వార్డు ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ వద్ద గల జీవీఎంసీ కల్యాణ మండపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రి అమర్‌నాథ్ మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేశారని.. సామాజిక సాధికార యాత్ర ద్వారా చేసిన మంచిని ప్రజలకు చెప్పుకోవడానికి అవకాశం కలిగిందన్నారు. సామాజిక సాధికార సభలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై.. మద్దతు తెలుపుతున్నారన్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. సామాజిక సాధికార యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. చంద్రబాబు పాలనలో బీసీలకు న్యాయం జరగలేదన్నారు. ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో 98.5 శాతం నెరవేర్చిన గొప్ప నాయకుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీల్లో 10 శాతం కూడా నెరవేర్చలేక చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. అందుకే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. డిప్యూటీ మేయర్ కె.సతీష్, 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నల్ల కృపాజ్యోతి, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిగ్ స్క్రీన్‌పై ఫైనల్ ఫైట్

- నేడు భారత్–ఆస్ట్రేలియా మధ్య టైటిల్ పోరు
- సాగరతీరంలో ఏసీఏ ఆధ్వర్యంలో భారీ తెరపై ప్రత్యక్ష ప్రసారం

విశాఖ స్పోర్ట్స్: క్రికెట్ ప్రపంచకప్‌లో భాగంగా భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆదివారం జరగనున్న ఫైనల్ మ్యాచ్ కోసం యావత్ ప్రపంచం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. అసలు సిసలైన క్రికెట్ మజాను ఆస్వాదించేందుకు ఎవరి ఏర్పాట్లలో వారు తలమునకలయ్యారు. అభిమానుల కోసం స్టేడియంలో మ్యాచ్‌ను చూస్తూ పొందే అనుభూతిని అందించేందుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే భారత్–న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌ను విశాఖ, విజయవాడ, వైఎస్సార్ కడప జిల్లాల్లో భారీ స్క్రీన్‌లపై ప్రత్యక్ష ప్రసారం చేసింది. భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చి మ్యాచ్‌ను ఆద్యంతం ఎంజాయ్ చేశారు. ఈ నేపథ్యంలో టైటిల్ పోరును రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో బిగ్ స్క్రీన్లపై ప్రత్యక్ష ప్రసారం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు విశాఖ సాగరతీరంలోని కాళీమాత ఆలయం ఎదురుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి.. 'సాక్షి'తో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 13 ఉమ్మడి జిల్లాల కేంద్రాల్లో బిగ్‌స్క్రీన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ట్రాఫిక్ ఆంక్షలివీ..

దొండపర్తి: భారత్–ఆస్ట్రేలియా మధ్య ఆదివారం జరిగే ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌ను ఆర్.కె.బీచ్‌లో భారీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు డీసీపీ–1 కె.శ్రీనివాసరావు తెలిపారు. పోలీస్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

- ఆదివారం ఉదయం 10 నుంచి పార్క్ హోటల్ జంక్షన్ నుంచి నోవాటెల్ వరకు బీచ్‌రోడ్డులో ఎటువంటి వాహనాలు అనుమతించరు.
- క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు ఎంవీపీ కాలనీ, అప్పుఘర్, చిన వాల్తేరు మీదుగా వచ్చే వాహనచోదకులు ఎంజీఎం గ్రౌండ్‌లో వాహనాలు పార్క్ చేసుకోవాలి.
- సిరిపురం సీఆర్ రెడ్డి జంక్షన్ మీదుగా ఆర్.కె.బీచ్‌కు వెళ్లే వాహనచోదకులు ఏయూ ఇంగ్లిష్ మీడియం స్కూల్ జంక్షన్ నుంచి వెళ్లి ఏయూ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి.
- సీఆర్ రెడ్డి, ఆల్ ఇండియా రేడియో జంక్షన్ మీదుగా ఆర్.కె.బీచ్‌కు వెళ్లే వాహనచోదకులు తమ వాహనాలను ఏపీఐఐసీ మైదానంలో పార్క్ చేసుకోవాలి.
- పందిమెట్ట జంక్షన్ మీదుగా ఆర్.కె.బీచ్‌కు వచ్చే వారు తమ వాహనాలను ఏఎంసీ వద్ద నిర్దేశించిన పార్కింగ్ స్థలాల వద్ద పార్క్ చేసుకోవాలి.
- బీచ్ రోడ్డులో బాణసంచా కాల్చ కూడదు. ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు.

న్యాయం చేసే బాధ్యత నాదే..

- బీఆర్‌టీఎస్ బాధితులెవరూ ఆందోళన చెందవద్దు
- మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సింహాచలం : అడవివరం బీఆర్‌టీఎస్ బాధితులకు న్యాయం చేసే బాధ్యత తనదేనని, ఎవరూ ఆందోళన చెందవద్దని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. విశాఖ కార్యనిర్వాహక రాజధాని కానుండడంతో అడవివరం మార్గం చాలా కీలకంగా మారిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. రోజుకు రెండు లక్షల వరకు వాహనాలు అడవివరం మీదుగా రాకపోకలు సాగిస్తుండడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్న సంగతి తెలిసిందే అన్నారు. అలాగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు అనేకమంది భక్తులు సింహాచలం రావడానికి ఈ మార్గం ఎంతో కీలకమైనదన్నారు. గిరిప్రదక్షిణ సమయంలో ఇక్కడ నెలకొంటున్న ఇబ్బందులు ప్రత్యక్షంగా అందరూ చూస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ జరిగితే సింహాచలం క్షేత్రాభివృద్ధి కూడా ఎంతో బాగుంటుందని తెలిపారు. వీటిని దృష్టిలో ఉంచుకుని బీఆర్‌టీఎస్ మార్గం విస్తరణ అనివార్యం అయినా.. తరతరాలుగా ఇక్కడ నివసిస్తున్న నిర్వాసితుల గురించి కూడా పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. వారికి ఎలాంటి అన్యాయం జరగదని తెలిపారు. ఇప్పటికే సమస్యను పలుమార్లు జీవీఎంసీ అధికారుల దృష్టికి, జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. బాధితులకు నష్టపరిహారంతోపాటు టీడీఆర్‌లు ఇచ్చేలా.. పూర్తిగా స్థలం పోయిన వారికి నష్టపరిహారం ఇచ్చేలా కలెక్టర్‌తో మాట్లాడినట్లు పేర్కొన్నారు. బాధితులందరికీ నష్టపరిహారంతో పాటు టీడీఆర్‌లు కూడా వస్తాయన్నారు. అలాగే పూర్తిగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు కూడా న్యాయం జరుగుతుందన్నారు. బాధితులెవరూ ఆందోళన చెందవద్దని, అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు.

పనుల అడ్డగింత

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలి పావంచా నుంచి పాత అడవివరం కూడలి వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులను స్థానికులు శనివారం అడ్డుకున్నారు. తమకు నష్టపరిహారం చెక్కులు, టీడీఆర్‌లు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారంటూ అధికారులను ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నేత బెహరా భాస్కరరావు, అడవివరం కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, టీడీపీ నేత పాసర్ల ప్రసాద్, 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, జనసేన భీమిలి సమన్వయకర్త పంచకర్ల సందీప్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సాయంత్రం వరకు పలు కట్టడాలను జీవీఎంసీ అధికారులు తొలగించారు. కాగా బీఆర్‌టీఎస్ బాధితులకు అన్ని విధాలా న్యాయం చేసేందుకే ఆదినుంచీ ప్రయత్నిస్తున్నామని, నష్టపరిహారం చెక్కులను ఇప్పటికే కొందరు తీసుకొన్నారని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ తెలిపారు. బాధితులకు టీడీఆర్‌లు కూడా వస్తాయని చెప్పారు.



సీసీపీ సురేష్‌తో మాట్లాడుతున్న నాయకులు

వచ్చే నెల ఒకటి నాటికి టీడీఆర్‌లు, పరిహారం

మురళీనగర్: బీఆర్‌టీసీ రోడ్డు విస్తరణలో ఆస్తులు కోల్పోయిన 284 మంది నిర్వాసితులను గుర్తించామని, వారికి డిసెంబర్ 1 నాటికి టీడీఆర్‌లతోపాటు పరిహారాన్ని విడుదల చేయనున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కొంతమందికి టీడీఆర్‌లతోపాటు పరిహారాన్ని కూడా అందించినట్లు పేర్కొన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణలో ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా 15 రోజుల్లోగా ఆస్తులు కోల్పోయిన నిర్వాసితులు జీవీఎంసీకి తెలపవచ్చని పబ్లిక్ నోటిఫికేషన్ తెలిపినట్లు పేర్కొన్నారు. కొంతమందికి నష్టం కలుగుతున్నప్పటికి లక్షల మందికి రహదారి విస్తరణ వల్ల ప్రయోజనం కలుగుతుందని ప్రజలు దీన్ని అర్థం చేసుకోవాలని కోరారు.

‘పట్టా’లు తప్పి పిచ్చి రాతలు

- క్రమబద్ధీకరణ పట్టాలపై ఈనాడు వక్రభాష్యాలు
- ‘భూ దందా’ అంటూ భయాందోళన సృష్టించే యత్నం


ఈనాడు
మధురవాడలో భూ దందా

మధురవాడ : సిగ్గూ ఎగ్గూ.. ఉచ్చం నీచం అన్నీ వదిలేసి రాసిన రాతలెలా ఉంటాయో ‘ఈనాడు’ను చూస్తే అర్థమైపోతుంది. పేదల క్రమబద్ధీకరణ పట్టాలు.. అదీ టీడీపీ హయాంలో ఇచ్చిన వాటిపై వక్రభాష్యాలు చెబుతూ.. వైఎస్సార్ సీపీపై నిందలు వేస్తూ.. షరామామూలుగా కథనం వండి వార్చేసింది. 2014కు ముందు ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వడానికి ఉద్దేశించి 388తో పాటు 296 జీవోలను గత తెలుగుదేశం ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ జీవో ద్వారా ఆ పార్టీకి చెందిన అత్యధికులకు క్రమబద్ధీకరణ పట్టాలిచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా పార్కులు, రోడ్లు, చెరువులు, గెడ్డలు, వాగుల్లో కూడా ఆ పార్టీకి చెందిన వారికి యథేచ్ఛగా పట్టాలు అందజేశారు. నిజమైన పేదవారు, లబ్ధిదారులకు పట్టాలిస్తే.. వారిపై పచ్చ పత్రిక వక్ర రాతలు రాసి భయాందోళనలు సృష్టిస్తోందని పలువురు ధ్వజమెత్తుతున్నారు. విశాఖ రూరల్ మండలం మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 191లో వైఎస్సార్ సీపీ నేతలు భూ దందాకు తెరలేపారని, ఇక్కడ 2.18 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు, వాగు భూమిని రిజిస్ట్రేషన్ చేసి అమ్మేస్తున్నారని.. ‘మధురవాడలో భూ దందా’ పేరుతో ఈనాడు అచ్చేసింది.

ఆరోపణ: మధురవాడలో భూ దందా

వాస్తవం: ఈ భూమికి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జీవో ఎంఎస్ నంబర్ 388 కింద డబ్బులు కట్టించుకుని 2018లో పట్టాలు మంజూరు చేశారు. ఇక్కడ నలుగురు మహిళలు 1,100 గజాల భూమికి పట్టాలు పొందారు. మిగిలిన భూమికి, ఈ పట్టాలు పొందిన వారికి గానీ, వైఎస్సార్ సీపీకి చెందిన వారికి గానీ ఎటువంటి సంబంధం లేదు. 1,100 గజాలు భూమిలో ఉన్న నివాసాలకు 2012 నుంచి ఇంటి పన్ను, కరెంట్ మీటర్, బోర్‌లు వంటివి ఉన్నాయి. ఇదే సర్వే నంబర్‌లో ఇంకో 50 వరకు నివాసాలు ఉన్నాయి. వారిలో కూడా కొంత మందికి పట్టాలు వచ్చాయి. ఇవన్నీ టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పట్టాలే. అప్పుడు నిర్మించుకున్న ఇళ్లే..

టీడీపీ హయాంలోనే పట్టాలు ఇచ్చారు

అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవోకు అనుగుణంగా డబ్బులు కట్టి మరీ నాతో పాటు మరో ముగ్గురం పట్టాలు పొందాం. మాలానే పట్టాలు పొందిన వారు వందల్లో ఉన్నారు. 388 జీవో కింద పట్టాలు పొందిన వారికి ఇటీవల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు కూడా చేసింది. ఇలా పట్టాలు పొంది రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిలో ఎవరికీ ఇబ్బంది లేదు. మమ్మల్ని మాత్రం ఇబ్బంది పెడుతున్నారు. మేము భూ ఆక్రమణలకు పాల్పడ్డామని ఈనాడులో వచ్చిన వార్తల్లో ఏ మాత్రం నిజం లేదు. నేను కేవలం వైఎస్సార్ సీపీ నాయకురాలిని కావడం వల్లే కక్ష కట్టి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. తప్పుడు రాతలు మానుకోవాలి.

– ముదుండి రాజేశ్వరి, మధురవాడ

జెడ్పీ అంచనా బడ్జెట్ రూ.1,363.16 కోట్లు


పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

- ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులు
- పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చ
- ప్రశాంతంగా ముగిసిన సర్వసభ్య సమావేశం

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.1,363.16 కోట్ల అంచనా ఆదాయ బడ్జెట్‌ను సర్వసభ్య సమావేశం ఆమోదించింది. అలాగే రానున్న ఆర్థిక సంవత్సరానికి రూ.1,362.95 కోట్ల వ్యయ బడ్జెట్‌ను ఆమోదిస్తూ తీర్మానించింది. ఇక ప్రస్తుత (2023–24) ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.1,551.06 కోట్ల సవరణ బడ్జెట్‌కు కూడా ఏకగ్రీవంగా ఆమోదాన్ని తెలిపింది. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన శనివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పీ హాలులో జరిగింది. తొలుత గత సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలను అధికారులు వివరించారు. పంచాయతీరాజ్ శాఖకు చెందిన 72 పనుల బిల్లుల మొత్తాన్ని పూర్తిగా చెల్లించినట్టు జెడ్పీ సీఈవో పోలినాయుడు సభ్యులకు చెప్పారు. జనరల్ ఫండ్‌కు చెందిన 105 బిల్లులను కూడా క్లియర్ చేశామని, నెల రోజుల్లో సంబంధిత ఖాతాల్లో సొమ్ము జమ అవుతుందని వివరించారు. అనంతరం వ్యవసాయ శాఖపై చర్చ జరిగింది. సెప్టెంబర్ ఆఖరు వరకు అనకాపల్లి జిల్లాలో ఆరు వేలు, విశాఖ జిల్లాలో వెయ్యి ఎకరాల్లోను వరి పంట ఎండిపోయిందని, అల్లూరి జిల్లాలోనూ వరి పంట దెబ్బతిందని, దీంతో ఖరీఫ్ దిగుబడులు తగ్గుతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. ఈ పరిస్థితులను ప్రభుత్వానికి నివేదించామన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాను కరువు జాబితాలో చేర్చాలని కోరుతూ తీర్మానించాలని సభ్యులు కోరారు. సభలో ఉన్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో 30–40 శాతం లోటు వర్షపాతం నమోదైందని, అక్టోబర్ ఆఖరు వరకు ఉన్న పంటల పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. కరువు పరిస్థితిపై సభలో తీర్మానం చేయాలని, తాను కూడా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

చందనోత్సవం వైఫల్యంపై చర్యలకు సిఫార్సు

ఇటీవల జరిగిన సింహాచలం చందనోత్సవం వైఫల్యం నేపథ్యంలో బాధ్యులపై చర్యలకు సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి నివేదించామని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సభ్యులకు తెలిపారు. ఇకపై చందనోత్సవ టికెట్ల ముద్రణ బాధ్యతను తామే తీసుకుంటామన్నారు. పంచగ్రామాల్లో ఇళ్ల మరమ్మతులకు ప్రభుత్వం మెమో ఇచ్చిందని, దీనిపై వచ్చే గురువారం నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. ప్రజాప్రతినిధుల ఫోన్లకు అధికారులు స్పందించాలని ఆదేశించారు. అంగన్వాడీ పిల్లలకు సరైన ఆహారాన్ని అందించలేదని ఫిర్యాదు చేసినా పట్టించుకోని అనకాపల్లి జిల్లా ఐసీడీఎస్ పీడీపై చర్యలకు కలెక్టర్‌కు సిఫార్సు చేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర తెలిపారు. ఒకరోజే సర్వసభ్య సమావేశం నిర్వహించడంతో అజెండా అంశాలు పూర్తిగా చర్చకు రాకుండా ముగిసిపోతోందని, అందువల్ల రెండు పర్యాయాలు నిర్వహించాలని పరవాడ జెడ్పీటీసీ పైలా సన్యాసిరావు కోరారు. స్పందించిన జెడ్పీ సీఈవో పోలినాయుడు మెజార్టీ సభ్యుల అభిప్రాయాలకనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

కోరం లేక ‘స్థాయీ’ వాయిదా

ఉదయం 9 గంటలకు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం జరగాల్సి ఉంది. అయితే కోరం లేకపోవడంతో అధికారులు దానిని మధ్యాహ్నానికి వాయిదా వేశారు. ఆ సమాచారం తమకు ముందుగా తెలియజేయలేదంటూ కొంతమంది సభ్యులు అధికారుల తీరుపై మండిపడ్డారు. వారిని అధికారులు సముదాయించి సర్ది చెప్పారు. సమావేశంలో వ్యవసాయం, వైద్యారోగ్యం, విద్య, డీఆర్‌డీఏ, పౌరసరఫరాలు, డ్వామా, అటవీ, విద్యుత్, ఆర్అండ్‌బీ తదితర శాఖలపై చర్చించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

- 20 నుంచి టాస్క్‌ఫోర్స్ కమిటీ తనిఖీలు
- 18 ఏళ్లలోపు పిల్లలను పనుల్లో చేర్చుకోవద్దు: కార్మిక శాఖ

మహారాణిపేట: జిల్లాలో బాల కార్మికులను గుర్తించడం, విడుదల చేయడం, పునరావాసం కల్పించడం ద్వారా బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి జిల్లా కార్మిక శాఖ ప్రణాళిక రూపొందించింది. కార్మిక శాఖ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఈ నెల 20 నుంచి వచ్చే నెల 10 వరకు తనిఖీలు నిర్వహించనున్నట్లు శాఖ ఉప కమిషనర్ ఎం.సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల లోపు పిల్లలను పనుల్లో చేర్చుకోకుండా వారి జీవన హక్కును కాపాడాల్సిందిగా ఆమె కోరారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జిల్లా టాస్‌ఫోర్స్ కమిటీ చైర్మన్, జిల్లా న్యాయ సేవాధికార సమితి సెక్రటరీ, ఉన్నత సివిల్ జడ్జి ఎం.వి.వి.శేషమ్మ చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. కార్మిక శాఖ, అనుబంధ శాఖల అధికారులు, హెచ్‌వోడీలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పనిచేస్తున్న ఎన్‌జీవోలు హాజరవుతారన్నారు.

పాఠశాలల్లో చేర్పిస్తాం..

తనిఖీల్లో గుర్తించిన బాల కార్మికులను సంబంధిత ఎన్‌జీవోల ద్వారా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ)లో హాజరు పరిచి వారికి హితోపదేశం చేసి స్కూల్‌లో చేర్పిస్తామని ఉప కమిషనర్ సునీత తెలిపారు. సెక్షన్ 3, 3(ఏ), బాల, కౌమార నిరోధక, నిబంధనల చట్టం 1986, మార్పబడిన చట్టం 2016, 2017 కింద కేసులు నమోదు చేసి ప్రతి యజమాని వద్ద రూ.20 వేలు వసూలు చేస్తామన్నారు. ఆ మొత్తాన్ని సంక్షేమ నిధిలో జమచేసి.. బాలల మైనారిటీ కాలం పూర్తయ్యాక వడ్డీతో సహా వారికి అందజేస్తామన్నారు.

వచ్చే నెల 15 నుంచి ఆడుదాం ఆంధ్ర

- 20 నుంచి ఆటగాళ్ల నమోదు
- రాష్ట్ర స్థాయి పోటీలకు విశాఖ వేదిక

విశాఖ స్పోర్ట్స్ : ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్ ఐదు స్థాయిల్లో డిసెంబర్ 15 నుంచి జనవరి 26వ తేదీ వరకు జరగనుందని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ప్రతిష్టాత్మకంగా గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించ తలపెట్టిన ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్ నిర్వహణపై సన్నాహక సమావేశం శనివారం కలెక్టర్ ఎ.మల్లికార్జున నిర్వహించారు. వార్డు స్థాయి నుంచి జరగనున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆటగాళ్ల నమోదు కార్యక్రమాన్ని ఈనెల 20 నుంచి ప్రారంభం కానుందని, 19న సంబంధిత యాప్, వీడియోను విడుదల చేయనున్నామన్నారు. 21 నుంచి పాల్గొనే ఆటగాళ్లకు స్పోర్ట్స్ కిట్స్ అందించనున్నామన్నారు. మంచి ట్రాక్ రికార్డు ఉన్న క్రీడాకారులకు అంబాసిడర్ హోదా కల్పిస్తామన్నారు. రవాణా, ఆహార, తాగునీరు, వైద్య సదుపాయాలు, ఇతర వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విశాఖ వేదికకానుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, సెట్విస్ సీఈవో కీర్తి, డీఎస్ఏ చీఫ్ కోచ్ గాలియట్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రత్యక్షంగా పాల్గొనగా.. సచివాలయ, మండల, నియోజకవర్గ స్థాయి అధికారులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు.

ఐదు క్రీడాంశాల్లో...

తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన ఆడుదాం ఆంధ్రలో ఐదు క్రీడల్లో పోటీలు జరగనున్నాయి. క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీతో పాటు ఖోఖో పోటీలు నిర్వహించనున్నారు. ఐదు స్థాయిల్లో ఈ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నగదు పారితోషికాలతో జట్లను ప్రోత్సహించనున్నారు. వార్డు స్థాయిలో మొదలై మండల, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయితో ముగియనున్నాయి. పదిహేనేళ్లు పూర్తి చేసిన వారంతా ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు.

22న ట్రయల్ మ్యాచ్‌లు

తొలి స్థాయిల్లో బేసిక్ నిబంధనలతో పోటీలకు అర్హత కల్పించినా.. నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మూడు దశల్లోనూ పూర్తి నిబంధనల మేరకే టోర్నీ జరగనుంది. ఈ స్థాయిల్లో రాణించిన జట్లకే నగదు ప్రోత్సాహకాలు అందనున్నాయి. ఈనెల 22న ట్రయల్ మ్యాచ్‌లు జరగనుండగా 25 నుంచి ఇంటింటికి వలంటీర్ల సర్వే చేపట్టనున్నారు. ఇంకెందుకు ఆలస్యం వార్డు స్థాయిలో ఆటగాళ్ల పేర్లను నమోదు చేసుకోండి.